# మిసెస్ శారద...పోస్ట్‌మన్...!

"పోస్ట్, సార్....!"

వీథిలోనికి పరుగున వెళ్లింది శారద-అల్లుకుంటున్న పొడుగాటి జడను వదిలేసి.

అబ్బ, మూడిళ్ల అవతల ఉన్నాడు. తనకీ రోజైనా ఉత్తరం వస్తుందా?

ఆ డాబా ఇంటి కాలేజీ అమ్మాయికి రోజూ ఉత్తరాలు వస్తాయి. ఎవరు వ్రాస్తుంటారో? ఒకవేళ ప్రేమలేఖలేమో? నవ్వొచ్చింది. తను కాలేజీలో చదువుకునే రోజుల్లో కూడా, నాన్న దగ్గరనుంచి ఉత్తరం కోసం ఎదురు చూస్తుంటే ఎవడో ఒకడు విరహం వెళ్లగ్రక్కుతూ వ్రాసే ప్రేమలేఖ అందేది. ఏడుపు, నవ్వు కూడా వచ్చేవి. ఇలా వీళ్లు డబ్బును వ్యయం చేస్తుంటే, ప్రభుత్వానికి పరోక్షంగా సహాయం చేస్తున్నారనిపించేది. వాళ్లు పరీక్షలు పాస్ అయ్యారో, లేదో-ఇప్పటికైనా.

ఆయన మాత్రం తనకెన్ని ఉత్తరాలు వ్రాస్తూ ఉండేవారో పెళ్లి కాక పూర్వం? తనకెందుకో ఆ ఉత్తరాలు చింపబుద్ధి వేసేది కాదు. చదవకూడదనుకుంటూనే సాంతం చదివేది. "ప్రేమించాను... నిన్ను తప్ప మరొకర్ని చేసుకోను.." సారాంశం అయినా ఎంతో పొందిగ్గా వ్రాసేవారు. ఆ ఉత్తరాలు మొదట్లో ఆకర్షిస్తూ అలాఅలా తనను ఆకట్టుకున్నాయి. ఆ చెప్పలేని మమతే అలా ఎదిగి ఏరులై, కోనేరులై, గోదావరులై అనాలోచితంగానే తనను వివాహానికి ఒప్పించింది...

తను ఆ మాటే అంటే ఆయన నవ్వుతూ అనేవారు-"శారదా, నువ్వు మొదట్లోనే నా ఉత్తరాలు చించిపారేసి ఉంటే నేను నిన్ను పొందేవాణ్ని కాదన్నమాట!" అని.

ఏమో, తను జవాబు చెప్పేది కాదు. కాదు, చెప్పలేదు.

అలాంటి ఆయన ఈ ఏడాదిలో తనకెన్ని ఉత్తరాలు వ్రాశారు? లెక్కగా వచ్చాయి. అంతే! తను రోజూ ఎదురు చూడ్డం, రాకపోవడం, నిజంగా ఈ ఏడాదిలో నిస్పృహల నిష్పత్తే ఎక్కువ! అలాగే ఓసారి తను వ్రాసిన గుర్తు.

"మీ దగ్గరనుంచి ఉత్తరం కోసం రోజూ ఎదురుచూస్తాను. 'ఇంకా ఏమిటీ పిచ్చి'ని నవ్వుకుంటున్నారు కదూ? ఎందుకో ఉత్తరం వచ్చిన నాడు మిమ్మల్ని చూచినట్టవుతుంది. ఈ ఒంటరితనాన్ని క్షణం మరిచిపోతాను. కానీ, ఈ అనుభూతికి నేనేం కారణం చెప్పుకోలేకపోతున్నాను..."

తనకు ఉత్తరం వచ్చినా, అత్తయ్య, మావయ్య, వదిన, అమ్మ, నాన్న, చెల్లాయిలే అందులో ఒకటికి పదిసార్లు కనిపించేవారు. తనకు కావాల్సిందేదో లేదనిపించేది. అయినా మగవాళ్లకు బాధపెట్టడం చేతనయినట్టుగా మరేం తెలియదు.

అసలు ఆ విశాఖపట్నం చదువంటేనే తనకు భయం. పట్టి కాస్మోపాలిటన్ కల్చర్. ఎంతమంది ఆడపిల్లలు, లేడీ ప్రొఫెసర్స్ టిప్‌టాప్‌గా, గ్లామరస్‌గా యూనివర్సిటీకి వస్తారు? వాళ్లలో ఎవరో ఆయన్ను... ఛీ, నవ్వొచ్చేది.

ఈ లోకంలో ఆడవాళ్లంతా మాయమైపోయి తనొకతే ఆయనకోసం మిగలకూడదూ? తీయని ఆలోచన. ఆయన అటువంటివారు కారు.

దృఢతరం చేసుకునేది మనస్సును, గాలిపటంలా ఎగురుతుంటే.

అదిగో పక్కింటి పిన్నిగారు నవ్వుకుంటూ ఉత్తరం అందుకుంటూంది. అలా తనవైపు చూసి నవ్వుతుందెందుకూ?

పోస్ట్‌మన్ గేట్ దగ్గర సైకిల్ ఆపాడు. లోపలికి వస్తున్నాడు. అడగాలనిపించింది. భయం ఏ జవాబు వినవలసివస్తుందోనని.

"సుబ్బలక్ష్మమ్మగారూ! ఉత్తరం అండీ!"

పక్కవాటాలోవాళ్లకు ఇచ్చాడు. తనను చూడలేదా? 'పోనీ, మీకు లేవండీ అని చెప్పకూడదూ?' వెధవ సస్పెన్స్. వెళ్లిపోతున్నాడు. తనకనుమానం ఆ ఉత్తరాల కట్టలో తన ఉత్తరం ఏ మూల నలిగిపోతూందోనని. హఠాత్తుగా అడిగింది-"మాకేం లేవా, పోస్ట్‌మన్‌గారూ!"

**శ్రీ సుభా**

వెనక్కు తిరక్కుండానే అన్నాడు "ఉంటే ఇవ్వనాండీ?"

అబ్బ, ఎంత ఎగతాళి? ఉండి ఇవ్వనట్లయితే ఊరుకునేదెవరో? లేవని చెప్పకూడదూ? సైకిల్ బెల్ ఖంగున మ్రోగించి వెళ్లిపోయాడు.

వెధవది. ఒక్కొక్క పోస్ట్‌మన్ అసలే ఉత్తరాలు పట్టుకురాడు. పూర్వం తను కాలేజీలో చదువుకునే రోజుల్లో సుబ్బయ్యగారు ఎన్ని ఉత్తరాలు ఇచ్చేవారు పాపం! నవ్వుతూ "శారదమ్మగారూ! ఈ ఊళ్లోకల్లా పెద్ద టపా మీ ఒక్కరిదేనమ్మా!" అనేవాడు. తనకెంతో గర్వంగా ఉండేది ఆ రోజుల్లో.

రాదనుకున్ననాడు కూడా ఏదో ఉత్తరం వచ్చేది. ఇప్పుడు వస్తుందనుకుని వేయి కళ్లతో ఎదురు చూసినా...

ఇంట్లోంచి అమ్మమ్మ వచ్చింది.

"ఏమే, అతని దగ్గరనుంచి ఈ రోజైనా ఉత్తరం వచ్చిందా?"

తనకసలే ఉక్రోషంగా ఉంది. ఆపుకుంటూ అంది: "రాలేదమ్మమ్మా...! రేపు వస్తుందేమో!"

"అదేమిటే... ఒక్క ఉత్తరం ముక్కయినా వ్రాయడం మానివేశాడు?"

అమ్మమ్మ ఆయన్నింకా ఏమన్నా అడిపోసుకుంటుందేమోనని ఆదుర్దా. మనకు ఇష్టమైన వ్యక్తిలో ఇతరులు లోపాలెన్నడం సహించలేదు మనస్సు.

"లేదమ్మమ్మా! వ్రాయకుండా ఉండరు. పరీక్షలు జరుగుతూ ఉండాలి!"

"నాలుగైదు రోజుల క్రితం అయిపోయాయన్నావు కదే?"

లోపలి నుంచి వస్తున్న కోపం, ఎగసే బాధ కొత్తస్వరం కలిపాయి...

"వెధవ పరీక్షలు... ఒక్కొక్కసారి పాడిగిస్తారమ్మమ్మా!"

"ఏమిటోనమ్మా... పాడుకాలం!" లోపలికెళ్లింది అమ్మమ్మ. తనూ లోపలికి వెళ్లడంకన్నా మరేం చేయలేకపోయింది.

గదిలో అద్దంలో తన రూపం సగం చిక్కినట్టు కనిపిస్తూంది. ఆ కళ్లల్లో ఆయన అనే శోభేదీ? గర్వంగా ఎగిరే జుట్టు... ఈ అదిరే పెదవులు... గోడ మీద ఫొటోలో దశరథరాముడు సీతాసమేతంగా నవ్వుతున్నాడు-ఎగతాళి కాదు కదా?

అటు తిరిగింది తను. పెళ్లినాటి ఫొటో, సిగ్గుచేత పుత్తడిబొమ్మ అయిన తను. ఆ బొమ్మను ఆనుకుని నిలబడ్డ ఆయన. మరొకవైపు భారంగా తిరిగింది మనస్సు. ఆ చప్పుడుకు గోడమీద రెండు బల్లులు పరుగుతీశాయి. అద్దంలో అందం చెదిరింది.

పక్కవాటా వాళ్ల కూతురూ, కొత్తల్లుడూ కలిసి తెగ నవ్వుకుంటున్నారు. దూరంగా సంతోషంతో అరుస్తున్న సినిమా డ్యూయెట్. వంటింట్లో గిన్నెల నాదం బాధాకరం. అన్నీ కర్ణకఠోరం, కళ్లు అశ్రుతప్తాలు కాబోతున్నాయి. గుండె ఎక్కడికో వెళ్లి ఆ ప్రదేశం ఖాళీ అయి బాధపడుతూంది. తోచనితనం, ఒంటరితనం కలిసి శరీరంలో కుస్తీలు పడుతున్నాయి.

ఇన్ని అశక్తుల ప్రభావం భర్త కోసం, భర్త క్షేమం కోసం ఎదురుచూచే శారదను నిద్రలో ముంచేశాయి-బెంగలో రంగరించి ఆవేదనలో ఆరగించి, ఆలోచనలో కరిగించి, అంతకు తప్ప మరేం చెయ్యలేక...

000 000 000

మరునాడు సరికొత్త ఆశలతో పుట్టింది. పదకొండు గంటలకు గానీ పోస్ట్ రాదు. శారద లేచింది. లేచీ లేవడంతోనే మంగళసూత్రద్వయాన్ని కళ్లకద్దుకుంది. మొదట్లోనే సీతారాముల్ని చూసింది. విశాఖపట్నం వెడుతూ ఆయన ఇచ్చిన 'ఎస్' డిజైన్ ఉంగరం చూసుకుంది.

ఈ రోజైనా ఉత్తరం రావాలి. తప్పదు. లేకపోతే మనిషయినా రావాలి. లేకపోతే... లేకపోతే... లేకపోతే లేదు జరగదు. అంతే-అనుకుంది. గట్టిగా, నిండుగా.

కాలం ఆలోచనలతో పరుగుపందెం వేసుకుంది. భోజనం అయింది.

తెల్లని క్రేపు జార్జెట్ చీర నీలం పువ్వుల బోర్డరున్నది కట్టుకుంది. హంసలు వేసిన నీలం

**ఈ కథను ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక 30.8.1961 సంచికలో ప్రచురించాము.**

హాండ్‌లూమ్ జాకెట్ వేసుకుంది. మెడలో సన్నని చెయిన్. ఎర్రటి బొట్టు, నీలం గాజులు. కొత్త చీర శరీరానికి ఏదో అనుభూతిగా కితకితలు పెడుతూంది. ఈ అలంకారం దేనికీ? తనకే తెలియదు. ఒక్కొక్కరోజు ఎందుకో ఆయనకు ఇష్టమైనట్టు ఉండడం తనకిష్టం. అంతే!

"ఎక్కడికే ప్రయాణం? మామయ్యగారింటికి గానీ వెడతావా?"

"ఊఁ" జవాబు చెప్పలేక కాదు, తెలియక. పదీ ముప్పై... ముప్పై ఒకటి... రెండు... ఐదు... నలభై...

వంటింట్లో పెద్ద శబ్దం అయింది. శారద లోపలకు వెళ్లింది. తలుపులు తీసి గడపమీద తల పెట్టుకుని నిద్రపోతూంది అమ్మమ్మ. తెల్లపిల్లి పాలగిన్నె వదిలి పరుగుపెట్టింది.

"ఏమండోయ్... సుబ్బలక్ష్మమ్మగారూ... సుబ్బలక్ష్మమ్మగారూ!"

పక్క వాటాలో ఆవిడను పోస్ట్‌మన్ పిలుస్తున్నట్టున్నాడు. ఆవిడ భర్త వారం వియోగానికే రెండు ఉత్తరాలు వ్రాస్తాడు కనీసం -తన నాలుగో పుష్కరంలో కూడా.

తను పరుగున వెళ్లింది వీధిలోకి. ఎడమవైపు గుమ్మం దగ్గర నిలుచున్నాడు పోస్ట్‌మన్. వీడెవడో కొత్తవాడులా ఉన్నాడు. పాతవాడు పోయాడు. పీడపోయింది. అయినా వీడు సరిగా డెలివరీ చెయ్యగలడా? కొంపతీసి ఒకళ్లవి మరొకరికి...

ఇంతలో సుబ్బలక్ష్మమ్మగారు నవ్వుతూ వచ్చి ఉత్తరం అందుకుని వెళ్లిపోయింది. ఆ నవ్వులలో ఏదో గొప్పచూడు, నీకన్నా నయం అనే మూగఅర్థంతో.

ఇదేమిటి పోస్ట్‌మన్ వెళ్లిపోతున్నాడు? ఆగలేక అడిగింది -"మాకేం లేవా?"

పోస్ట్‌మన్ వెనుకనుంచే అన్నాడు"మాకేం లేవా అనే పేరనేం ఉత్తరాలు లేవండీ!" అని.

తనకు ఒళ్లు మండింది. వీడెవడో హాస్యం మాట్లాడుతున్నాడు అనుకుంది. తమాయించుకుని అడిగింది-"అదేనోయ్, మిసెస్ శారద... కేరాఫ్ జగన్నాథరావుగారు!"

"ఆఁ... చూస్తానుండండి!" అన్నాడు.

"గోపాలరావు... రిటైర్డ్ టైరు కంపెనీ మానేజరు."

"సూర్యనారాయణ... బి.ఏ... మిస్ సరోజిని... మిస్... వెంకటలక్ష్మి..." వాడు ఆగి... "మీ పేరెవరన్నారు?" అని తిరిగి ప్రశ్నించాడు.

"మిసెస్ శారద!" అంది ఆదుర్దాగా.

"మీరు మిస్ కాదన్నమాట!"

శారద ఉరిమిచూసింది. పోస్ట్‌మన్ అటు తిరిగి అన్నాడు. లేనట్లయ్యితే ఏమయ్యేవాడో?

"ఉన్నాయా, మాకేమైనా?"

"మిసెస్... మిస్... మిస్సండీ!" అన్నాడు.


శారద హృదయం భగ్గుమంది. ఛీ, ఇలా ఉత్తరం కోసం, ఏమైనా సరే, తను ఎదురు చూడకూడదనుకుంది. ఎంత గొప్ప? వారం క్రితం వస్తానన్న మనిషి కనీసం కారణం ఏమిటో వ్రాయలేకపోయారు. ఎదుట మనిషి ఆత్రుతనూ, ఆర్ద్రతనూ అర్థం చేసుకోలేని...

పోస్ట్‌మన్ ముందుకు పోతున్నాడు.

శారద వెనక్కి తిరిగింది.

"ఏమండోయ్!" అన్నాడు కాంపౌండ్ గేటులోంచి పోస్ట్‌మన్.

"మిసెస్ శారదగారికి ఉత్తరం ఉందండీ!"



అన్నాడు.

"ఆ... య... నే...!" అంది ముందుకు పరుగున వెళ్లి.

"ఇవిడైతే మిసెస్ శారదే గానీ, కేరాఫ్ మారేజ్ ఇన్‌ఫర్మేషన్ బ్యూరో."

"ఏమిటయ్యా, అడ్రసులు సరిగా టాలీ చేసుకోలేని వాడికి ఉద్యోగం దేనికి?"

"ఈ వీధికి కొత్త, అమ్మాయిగారూ! కొత్తలో అలాగే ఉంటుందండీ ఎవరికైనా!" చిన్నమొహం చేసుకుని ఉత్తరాల కట్ట చూసుకుంటున్నాడు. అన్ని ఉత్తరాలలో, అబ్బ, తనదే లేకపోవడం. ప్రతి ఉత్తరం తనను చూసి నవ్వుతున్నట్టనిపించింది.

నెమ్మదిగా, భారంగా లోపలకు మళ్లింది శారద.

"ఏమండోయ్, ఇదిగో మిసెస్ శారద... ఉత్తరం ఉందండోయ్!"

శారద ఆత్రుతగా క్షణంలో వెయ్యోవంతు కాలంలో ఉత్తరం అందుకుంది. కళ్లు రత్నాలయ్యాయి. కెంపులయ్యాయి. అంతే టైములో చింపింది కవరు.

"మిసెస్ శారదగారూ!

"మీ కంటి చివరి చూపుకోసం ఎన్నో రోజులుగా కనీసం సంవత్సరంగా ఎదురు చూస్తున్నా. ఇంతవరకూ అది నెరవేరలేదనే చెప్పుకోవాలి. కానీ ఆశ, నన్ను ఆకాశానికి ఎత్తుతూంది... దానితోపాటు విహంగమవడం తప్ప మరేం చేయలేకపోతున్నాను. మీరెవరైనాసరే, మీలో ఎన్ని లోపాలున్నా సరే మీరు నాకు కావాలి! నా దేవతగా పూజించుకుంటాను. మీతో తప్ప నాకు ఈ లోకంలో మరి దేనితోనూ నిమిత్తం లేదు. ఉన్నది ఏదైనా మీతోనే... మీ సాన్నిహిత్యంలోనే. మీ చూపు కోసం ప్రాణం ఇచ్చే...

"పోస్ట్‌మన్"

ఒళ్లు వేడెక్కిపోయింది. కళ్లల్లో నిప్పు రాజుకుంది.

"ఫూల్!" అరిచింది. "నీ ఉద్యోగం తీయించేస్తాను-ఇటువంటి వెధవ్వేషాలు వేశావంటే! రాస్కెల్...!"

"చూడండీ, ప్రేమించడం వెధవ పనని మీరంటే నేనేం చెప్పలేను. కానీ ప్రతివాళ్లూ ప్రేమిస్తారు. మీరు మాత్రం ప్రేమించలేదా ఎవరినీ? కాదనగలరా?" నవ్వుతూ అడిగాడు.

"బయటకు నడు... రోగ్! ఇడియట్!" గుండె మండి జ్వాలలు రేపుతూంది.

"ఒక్కసారి..."

శారదను వెడల్పాటి తన చేతులతో బంధించాడు పోస్ట్‌మన్ ఆరుబయట, వరండాలో, పదకొండు గంటల కాలంలో... కాలమహిమ...!

"ఛీ! వదులు...!"

చెంప చెళ్లుమంది రెండుసార్లు. టోపీ ఎగిరి పడింది. గడ్డం అక్కడక్కడా ఊడి చేతికొచ్చింది. చేతికి ఎర్ర రంగయింది.

"శారదా!" తీయని పిలుపు. ఆ లోకంలోకి ఆహ్వానించే పిలుపు తనకు అలవాటై గిలిగింత పెట్టే తలంపు.

"మీరా!?" అంది ముద్దుగా, గోముగా, ఆశ్చర్యంగా-అన్నీ సమానంగా కంఠంలో సమన్వయించగా.

"ఛ.... మీ స్నేహితుణ్ని కాను, నేను సుబ్బారావును!" అన్నాడు.

"ఛ! పొండీ, ఏమిటీ తెగింపు? ఉత్తరం కూడా వ్రాయడం మాని, చదువూ పోయి ఆఖరికి పగటివేషాలు వేయడం నేర్చుకున్నారు..."

శారద ఆ కౌగిలి నుంచే అడుగుతూంది. తనకు తెలియదు ఎక్కడ ఉన్నదీ తను. "యూనివర్సిటీలో 'లా'కు బదులుగా పగటి వేషాలు అడాప్ట్ చేస్తున్నారా?"

"నీ కోసం, నీ నరదా కోసం. ఈ వేషం కాదు, చాలా వేషాలు వేయాలనిపిస్తుంది, శారదా!"

"అబ్బో! అన్నీ ఇక్కడి కబుర్లే!" అంది పద్మంలా శారద.

"అంటే ఈ కౌగిల్లోనా?" అన్నాడు భానుడిలా సుబ్బారావు.

"వదండి... ఎవరైనా చూస్తే .."

"మీ పక్కవాటా పిన్నిగారు చూసి ఆశ్చర్యంలో బొమ్మై దిమ్మైపోయి..."

"ఇంతకీ వేషం విశేషం?"

"ఆఁ... ఏం లేదు, శారదా! యూనివర్సిటీవాళ్లు ఈ సంవత్సరం ఢిల్లీకి డెలిగేట్స్‌గా మమ్మల్ని పంపిస్తున్నారు. అక్కడి వెరైటీ షోలో మనం వేషం శ్రీమతిగారి ముందు ట్ర్యూటినీకి పెట్టాం. మీరు కనిపెట్టలేకపోయారు. అనగా మిసెస్ శారద... మిస్..."

"అబ్బ! అరవబోకండి. లోపలకి పదండి!" అంది.

అలాగే ఇద్దరూ లోపలకెళ్లారు.,

"శారదా! వాడెవడే, రామ రామ... రామ... అయ్యో... రామా...!" అమ్మమ్మగారి బాధ.

"అమ్మమ్మగారు రామకోటి వ్రాయాలి గానీ, కంఠస్తోత్రం చేస్తే ముక్తి లేదండీ! నేను సుబ్బారావును!"

"ఇదేం వేషం నాయనా?"

"మీ మనుమరాలి నరదా అండీ ఇది. అలా వస్తేగానీ దర్శనం ఇవ్వనంది!

"ఓసి నీ ఇల్లు బంగారంగానూ!" అంది బామ్మగారు బోసినోటితో నవ్వుకుంటూ వంటింట్లోకి ఫేడౌట్ అవుతూ.

"ఏదీ... కొంచెం బంగారం పెడ్తావూ... మిస్ శారదా! కాదు, మిసెస్ శారదా సుబ్బారావు గారూ...! కాదు, కాదు మిసెస్ శారదా పోస్ట్‌మన్‌గారూ!"

"ఊఁ" అంది మేఘమాలికలా మిసెస్ శారద అతని చేతుల్లోంచి మిస్ అవుతూ.

"ఊహుఁ" అన్నాడు సాగదీస్తూ, గట్టిగా చెయ్యి పట్టుకుని, చందమామలా, సుబ్బారావులా, పోస్ట్‌మన్‌లా... ఆమెను మిస్ కాకుండా.

గోడమీద ఫొటోలో సీతారాములు సిగ్గుగా నవ్వుకున్నారు. అద్దం సిగ్గుచేత మరింత కందిపోయింది. దూలం మీద బల్లులు ఆశ్చర్యంగా చూచాయి. పక్కవాటాలో కొత్త జంట నవ్వు నూతిలో స్వరంలా అయిపోయింది శారదా సుబ్బారావుల సంతోషంలో... హాసంలో...

■

